జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 14-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 454 పేజీలు: 4 వెల : రూ.7



# ఎరువుల కోసం కొట్లాట

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 13 (వార్త):** ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతులు.. చివరికి కొట్లాటకు దిగాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ప్రస్తుతం వరి పంటకు ఎరువులు ఎంతో అవసరం. ఎరువులు వేస్తే పంట ఏపుగా పెరుగుతోంది. దీంతో రైతులు ఎరువుల కోసం షాపుల వద్ద గంటల కొద్దీ క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారు. చివరకు సహనం నశించి కూటమి నేతలు, కార్యకర్తలపై దాడికి సైతం పాల్పడుతున్నారు. సంతబొమ్మాళి మండలం, బూర్జ మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం 108 యూరియా బస్తాలు సంతబొమ్మాళి మండలం ఆకాశలక్క వరం గ్రామానికి రావడంతో పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచారు. వచ్చిన యూరియాని ఎప్పుడు పంపిణీ చేస్తారని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ మృదులను రైతులు అడుగగా సరిపడిన యూరియా ఇంకా రాలేదని ఇండెంట్ పెట్టిన యూరియా మొత్తం వస్తే పంపిణీ చేస్తామని వాయిదాలు వేస్తూ వచ్చారు. రోజులు గడుస్తున్న సరిపడ యూరియా రాకపోవడంతో వచ్చిన 108 బస్తాలు యూరియా పంపిణీ చేయడానికి శనివారం సిద్ధపడ్డారు. దీంతో రైతులు యూరియా కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. గంటలు తరబడి పడి కాపులు కాసిన, అగ్రికల్చర్ అధికారులు ఎవరూ రాలేదు. అయితే

కూటమి నాయకులు అగ్రికల్చర్ అసిస్టెంట్ మృదుల ను గ్రామంలో ఉన్న అసిరమ్మ తల్లి గుడి వద్దకు రహస్యంగా రప్పించి తమ అనుకూలమైన వారితో వేలిముద్రలు వేయించి స్లిప్పులను తీసుకున్నారు. పంపిణీ చేసే ప్రాంతం వద్ద కూడా వ్యవసాయ అధికారి ఎవరు రాకుండా చేసి కూటమి నాయకులే పెత్తనం చలాయించారు. గంటలు తరబడి యూరియా కోసం పడిగాపులు కాసిన రైతులకు అక్కడున్న కూటమి నాయకులు మాటలు మరింత కోపం తెప్పించాయి. స్లిప్పులు ఉన్నవారు మాత్రమే ఉండాలని మిగతా రైతులు వెళ్లిపోవాలని కూటమి నాయకులు హుకుం జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు గంటలు తరబడి ఇక్కడే ఉన్నాము. ఎవరికి ఇక్కడ యూరియా కోసం స్లిప్పులు ఇవ్వలేదు. మీకు ఎక్కడి నుంచి ఈ సిప్పులు వచ్చాయని పలువురు రైతులు కూటమి నాయకులను నిలదీశారు. వ్యవసాయ అధికారులు లేకుండా మీ పెత్తనము ఏమిటంటే రైతులు నిలదీశారు. దీంతో ఆగ్రహించిన టిడిపి కార్యకర్త కప్ప ఎర్రయ్య వైసీపీ కార్యకర్తలు, రైతులను బండ బూతులు తిట్టడంతో రైతులు తిరగబడి చితగ్గొట్టారు. విషయం తెలియడంతో

*** ఆకాశలక్కవరం, బూర్జలో గొడవలు, వాగ్వాదాలు, తోపులాటలు * కూటమి నాయకులు తమ వారికే ఎరువులు ఇప్పిస్తున్న వైనం * దీంతో అన్నదాతల అసహనం * చివరకు దాడులు * జిల్లాలోని పలుచోట్ల ఇదే పరిస్థితి * పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం * పోలీసు బందోబస్తు మధ్య ఎరువుల పంపిణీ**



నౌపడ ఎస్సై నారాయణస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు. ఆదివారం వ్యవసాయ అధికారుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పడంతో రైతులు శాంతించారు.

## బూర్జ మండలంలో తోపులాట

బూర్జ మండలంలోని పాలవలస, చీడివలస, తదితర గ్రామాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఈ క్రమంలో రైతుల మధ్య తోపులాట నెలకొంది. సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నచ్చజెప్పినా రైతులు శాంతించలేదు. అందరికీ ఎరువులు పంపిణీ చేస్తామని, ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారితో పాటు పోలీసులు నచ్చజెప్పడంతో రైతులు సంయమనం పాటించారు. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.



# ఈ గోతుల పాపం.. ఎవరిదీ?

*** గ్రామ దేవత సంబరాలకు తీసిన గోతులు * పూడ్చకుండా వదిలేసిన కమిటీ * గోతుల్లో పడి పలువురికి గాయాలు * పట్టించుకోని ఆర్‌అండ్‌బి, మున్సిపాలిటీ అధికారులు**

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 13 (వార్త):** ఇచ్ఛాపురం బస్ స్టాండ్ రోడ్డుపై ఉన్న గోతులతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. 2023లో గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారి సంబరాలు జరిగాయి. సంబరాల కోసం ఇక్కడ స్వాగతం గేటు ఏర్పాటు చేశారు. గేటు నిర్మాణం కోసం పెద్ద పెద్ద గోతులు తవ్వారు. సంబరాలు అనంతరం గేటు తీశాక గోతులు పూడ్చుతామని అప్పటి కమిటీతో పాటు గేటు కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. మధ్యలో గేటు నిర్వహణ విడిచిపెట్టి కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో వేరే వ్యక్తులు కమిటీ బాధ్యతలు తీసుకుంది. సంబరాలు గడిచి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు గోతులు పూడ్చలేదు. దీంతో రాత్రివేళ వాహనచోదకులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఆటో యూనియన్ సభ్యులు శ్రమదానం చేసి గోతులు పూడ్చారు. కురుస్తున్న వర్షాలకు గోతులు మళ్లీ యధాతథం అయ్యాయి.

గోతులు పూడ్చాలని ఇప్పటి తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కూడా మున్సిపాలిటీకి వినతిపత్రం అందజేశారు. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బి పరిధి కావడం పైగా బీటీ రోడ్డు కావడంతో మున్సిపాలిటీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అటు ఆర్‌అండ్‌బి అధికారుల అనుమతి లేకుండా గోతులు తీయడం, నష్ట పరిహారం చెల్లించక పోవడంతో ఆ శాఖ కూడా పట్టించుకోలేదు. ఇప్పటికైనా గోతులు పూడ్చి ప్రమాదాలు అరికట్టాలని ఇచ్ఛాపురం ప్రజలు కోరుతున్నారు.



## శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని శక్తి టీం హెచ్సీ నారాయణ రావు అన్నారు. శనివారం నరసన్నపేట కాలేజీ రోడ్డులో విద్యార్థినులకు శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శక్తి యాప్ ఉంటే ఒక పోలీస్ మీ వెంట ఉన్నట్లేనని తెలియజేశారు. అత్యవసర సమయాల్లో ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



# ప్రకృతి వనరులతో ఉద్దానాన్ని అభివృద్ధి చేయాలి

**-ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక**

**ప్రధాన కార్యదర్శి అజశర్మ**



**పలాస, సెప్టెంబరు 13(వార్త):** ఉద్దాన ప్రాంతంలో ఉన్న ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఉద్దాన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ అన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలు, మంచి ఉపాధి, నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ప్రైవేట్ భవనంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో జుత్తు సింహాచలం అధ్యక్షతన శనివారం ఉద్దానం ప్రాంత అభివృద్ధి, అవకాశాలు అవరోధాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర కల్పించి 80 కేజీల బస్తా రూ. 16 వేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో బాగంగా ఉద్దాన ప్రాంతంలో జీడి బోర్డుతో పాటు జీడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి బోర్డుతో పాటు జీడి, కొబ్బరి నార సహకార పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో ఉద్యాన పంటల పై జీవనం సాగిస్తున్నారని, మరెంత ఎక్కువగా సాగు చేసేందుకు అనుగుణంగా ఉచితంగా మొక్కలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఏడాది పంటలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో అత్యధికంగా వర్షపాతం నమోదవుతుందని, దాన్ని వినియోగించుకొని పంటలు పండించుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో యువకుల నుంచి వృద్ధుల వరకు ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, కిడ్నీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిపై పూర్తిస్థాయిలో పరిశోధనలు జరగడం లేదన్నారు. ప్రభుత్వం చొరవ చూపి పరిశోధన జరిగాలా చర్యలు చేపట్టాలన్నారు. పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మాణం చేపడుతున్న ఆఫ్షోర్ రిజర్వాయర్ కు శంకుస్థాపన చేసి ఏళ్ళు గడుస్తున్న నేటికీ పూర్తి కావడం లేదన్నారు. త్వరితగతిన ఆఫ్షోర్ రిజర్వాయర్ పూర్తిచేసి పలాస వజ్రపుకొత్తూరు మెలియాపుట్టి మండలాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునికరణ చేపట్టి శివారు భూములకు నిరంతరం సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ విద్య బలోపేతం చేయా లన్నారు. మత్స్యకారులకు ఉపాధితో పాటు రక్షణ కల్పించాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో నైపుణ్యాభి వృద్ధి, సైనిక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చీపురుపల్లి రాజాం, పాలకొండ కొత్తూరు పలాస రైల్వే లైన్లు అభివృద్ధి చేయాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాల యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కొత్తకోట అప్పారావు, పాలవలస ధర్మారావు, డాక్టర్ ఖగేశ్వర రావు, తెప్పల అజయ్, కె. హేమారావు చౌదరి, కూన వెంకట రావు, గోపాలకృష్ణ, బద్రి కుర్మా రావు, పోతనపల్లి గీతమ్మ, దేవేంద్ర వర్మ, వినోద్ కుమార్, జానకి రామయ్య, కొమర వాసు, బాబురావు, ధర్మారావు, గణేష్, మన్మథరావు, దొరబాబు పాల్గొన్నారు.




## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం పదిలం

**వీరఘట్టం, సెప్టెంబరు 13(వార్త):** ప్రకృతి వ్యవసాయం తోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆ దిశలోనే రైతులు పయనించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు శనివారం మండలంలోని గంగంపేట లో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు పొలం లైన్ షోయింగ్ (పి ఎం డి ఎస్ మొదట సంవత్సరం వేసిన పొలం) మరియు కెమికల్ వ్యవసాయం సాధారణ ఉడుపు 25 రోజుల తర్వాత ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. దీనిలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పొలం చాలా ఆరోగ్యంగా ఉండడం మరియు కలుపు లేకుండా ఉండడం అధిక పిలకలు రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యేతో పాటు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొర్లె గౌరు నాయుడు మండల యాంకర్ ఎం సింహాచలం కూడా ఉన్నారు

## డివిజనల్ స్థాయి పోటీలకు మందస క్రీడాకారులు



**మందస, సెప్టెంబరు 13(వార్త):** గుడారిరాజమణిపురం(వీరగున్నపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి బాల, బాలికల ఆటల పోటీల ఎంపికలు జరిగాయి. మండల స్థాయి స్కూల్ గేమ్స్ లో డివిజనల్ స్థాయి పలువురు విద్యార్థులు కబడ్డీ, యోగ, బాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులుగా ఎంపికయ్యారు. ఈనెల 15,16,17 తేదీలలో డివిజన్ స్థాయి ఎంపికలు బొడ్డపాడు, కాశీబుగ్గ, పలాస లో జరగనున్నాయి. ఈ పోటీల్లో వీరంతా పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

# పెచ్చులూడిన పోస్టాఫీసు భవనం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 13(వార్త):** మూలిగే నక్క పై తాటి పండు పడ్డ చందంగా తయారయ్యింది పోస్ట్ ఆఫీసు పరిస్థితి. అసలే ఖాతాలో డబ్బులు పోయావి అని గగ్గోలు పెడుతుంటే ఇప్పుడు ఏకంగా పెచ్చు లుడి ప్రాణాలు పోతున్నాయి అని వాపోతున్నారు. తాజాగా శనివారం సబ్ పోస్ట్ ఆఫీసు పై కప్పు పెచ్చు లూడి తృటిలో ప్రమాదం తప్పింది. రెండో శనివారం కావడంతో ఖాతాదారులు తక్కువగా ఉన్నారు. పబ్లిక్ కూర్చొనే ప్రదేశం లోనే పెచ్చు పెళలు పడ్డాయి. గతంలో ఆఫీసు లోపల పెళలు పడి సిబ్బంది కి స్వల్ప గాయాలయ్యాయి. ఇప్పుడు ఖాతాదారులు వంతు అయ్యింది. జై ఆంధ్రా ఉద్యమం లో సబ్ పోస్ట్ ఆఫీస్‌కి నిప్పు అంటించాక ఇక్కడ 1973 తర్వాత నూతన భవనం నిర్మించారు. సుమారు ఐదు దశాబ్ధాలుగా సేవలందిస్తుంది. పెయింట్ లకు తప్ప మరమ్మతులు కు నోచుకోలేదు. ఇటీవలి కురుస్తున్న వర్షాలకు భవనం పూర్తిగా తడిసి మరి కాస్త శిథిలావస్థకు చేరుకుంది. గతంలో నే ఉన్నతాధికారులు కు నివేదిక ఇచ్చిన ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. భవనానికి వెంటనే మరమ్మతులు చేయకపోతే ఇటు పని చేసేందుకు సిబ్బంది అటు ఖాతాదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే డబ్బులు గల్లంతు తో పోస్ట్ ఆఫీసు లో హాట్ టాపిక్ కాగా ఇప్పుడు పెచ్చులు పడి మరింత భయాందోళనకు గురి చేస్తుంది.

## పార్టీ కోసం కష్టపడేవారిని గుర్తిస్తాం



**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** వైసీపీ కోసం కష్టపడే కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందని నరసన్నపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. శనివారం నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో ఇటీవల జిల్లా సెల్ విభాగంలో నరసన్నపేట నియోజకవర్గం నుంచి నియమితులైన రామినాయుడు, శ్రీను, గోపి, రాముల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

# డీఎస్సీ-2003 వారికి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

**పోలాకి, సెప్టెంబరు 13(వార్త):** కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలని కోరుతూ శ్రీకాకుళం డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో శనివారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ ను, తప్పనిసరిగా అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తామని... ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు అట్టాడ తిరుమలేశ్వరరావు, అంబటి లక్ష్మణ్, గురుగుబెల్లి భాస్కరరావు, అట్టాడ తిరుమలేశ్వర్రావు, మానెం చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి భావన మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఆరు సచివాలయాలకు యూరియా సరఫరా



**సారవకోట, సెప్టెంబరు 13(వార్త):** సారవకోట మండలంలో శనివారం ఆరు సచివాలయాలకు యూరియా సరఫరా చేసినట్లు వ్యవసాయ అధికారి వెంకట రావు తెలిపారు. పెద్దలంబ, అవలింగి, అలుదు, మాలువ, వాంద్రాయి, కెలవలస సచివాలయాలకు యూరియాను పంపిణీ చేశామన్నారు. ఆయా సచివాలయాల్లోని పరిధిలో రైతులు పాస్ పుస్తకాలు తీసుకెళ్లి యూరియాను తీసుకోవాలని సూచించారు. ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## 147 కేసుల పరిష్కారం

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 13(వార్త):** కోటబొమ్మాళి కోర్టుల సముదాయంలో శనివారం (13.09.2025) ఫుల్ అడిషనల్ చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌లో ఏర్పాటు చేసిన బెంచ్ మొత్తం 147 కేసులను పరిష్కరించింది. వీటిలో సివిల్-3, క్రిమినల్ -22, ఎక్సైజ్ -1, ప్లీ బార్గయినింగ్ ద్వారా -80, అడ్మిషన్ - 39, మనోవర్తి - 2 కేసులు ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా మొత్తం రూ.57,50,000 సెటిల్‌మెంట్ జరిగింది. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.




# హిందీ భాష భారతీయుల శ్వాస




**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 13(వార్త):** కోవిలాం ఎంపీయుపి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు పెద్ద కోట వెంకట రావు ఆధ్వర్యంలో హిందీ దివస్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి-2 కె.చంద్రమౌళి పాల్గొని మాట్లాడుతూ హిందీ భాష భారతీయుని శ్వాసగాను అభివర్ణించారు. హిందీ భాషను అన్ని భాషల కంటే సులువైనదిగా ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అలాగే హిందీ సంస్కృతం నుండి పుట్టిందని అనేక పదాలు హిందీ తెలుగులో సమానంగా ఉంటాయని అందుకు తమ మాతృభాషను క్షుణ్ణంగా నేర్చుకుంటే మిగిలిన భాషలను అత్యంత సులువుగా నేర్చుకోవచ్చని విద్యార్థులకు పిలుపునిచ్చారు భారతదేశంలో 80% ఉంది ప్రజలు హిందీని మాట్లాడుతారని అందుకే భారత ప్రభుత్వం దేనిని జాతీయ భాషగా గుర్తింపు ఇచ్చారని తెలియజేశారు విద్యార్థులు హిందీ భాషలో మౌఖిక కేలు వక్రత్వము పోటీలు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు అనంతరం హిందీ గీతాలకు విద్యార్థులు నృత్యం ప్రదర్శన తిలకించి అభినందించారు కార్యక్రమంలో సి ఆర్ పి అచ్చుతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూల గజపతి రావు, పెద్దకోట శ్రీనివాసరావు, డి వెంకట్ లక్ష్మి, విశ్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాధ్యతలు స్వీకరించిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి



**వీరఘట్టం, సెప్టెంబరు 13(వార్త):** పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ గా ఎన్.ప్రభాకరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, ఏఎస్పి అంకిత సురానా , జెసి సి. యశ్వంత్ కుమార్ రెడ్డి , డిఆర్ఓ కె .హేమలత ,పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డా.ఆర్ వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, పాలకొండ డి.ఎస్.పి ఎం. రాంబాబు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎస్.సి. సెల్ జిల్లా కార్యదర్శిగా జీవన్

**మందస, సెప్టెంబరు 13(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్.సి. సెల్ కార్యదర్శిగా మందస మండలం, సువర్ణపురం గ్రామానికి చెందిన బెలమర జీవన్ నియమితులయ్యారు. వైస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఈ నియామకం జరిగినట్లు జీవన్ వెల్లడించారు. ఈ సందర్బంగా తనకి ఈ పదవి దక్కడం కోసం కృషి చేసిన వై.ఎస్.ఆర్.సీపీ రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జీవన్ మిత్రులు అందరూ కలిసి పూలమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ మెంబెర్ బత్తిని లక్ష్మణ్ తో పాటు జిల్లా యువజన కార్యదర్శి మడియా రామకృష్ణ, వై.సి.పి నాయకుడు దున్న గాంధీవర్మ, పలాస నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, దున్న బుజ్జి పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు




**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఏఎస్ఐ పోగిరి శంకర్రావు తెలిపారు. శనివారం ఉదయం నరసన్నపేట మండలం పెద్ద బొరిగివలస పంచాయతీలో స్థానిక గ్రామస్థులకు మహిళలకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సెల్ఫోన్లు వాడే వారు తెలియని నంబర్ నుంచి వచ్చిన కాల్స్ ఎత్తవద్దని చెప్పారు. బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు వస్తాయని ప్రజలకు వివరించారు.

## సత్యవరంలో రహదారి పనుల ప్రారంభం



**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** నరసన్నపేట మండలం సత్యవరంలో రహదారి నిర్మాణ పనులను ప్రారంభమయ్యాయి. ఎంపీపీ అరంగి మురళీధర్ ఈ పనులను శనివారం పరిశీలించారు. రహదారిని మండల పరిషత్ నిధులతో రూ.రెండు లక్షలతో నిర్మిస్తున్నామని చెప్పారు. వార్డ్ సభ్యులు నీలం రాజు, సీర లక్ష్మీనారాయణ ఉన్నారు. గుత్తేదారుకు నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మించాలని ఎంపీపీ ఆదేశించారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

**సారవకోట, సెప్టెంబరు 13(వార్త):** వాండ్రాయి సచివాలయ రైతు సేవ కేంద్రానికి యూరియా బస్తాలు వచ్చాయంటూ సమాచారం అందుకున్న రైతులు తరలి వెళ్లారు. అయితే కేంద్రానికి కేవలం 100 బస్తాల యూరియా మాత్రమే వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కేంద్రానికి సంబంధించి రెండు పంచాయతీలు నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు యూరియా కోసం రావడంతో ఘర్షణ చోటుచేసుకుంది. యూరియా ఇప్పించాలంటూ రైతులు కోరుతున్నారు.



## 12వ వేతన సవరణ కోరుతూ ఎస్టీయూ పోస్ట్ కార్డు ఉద్యమం




**ఎల్ ఎన్ పేట, సెప్టెంబరు 13(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రతీ ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ అమలు చేయడం అనేది ఎప్పుడూ ఆనవాయితీగా వస్తుందని అలాంటిది 11వ వేతన సవరణ గడువు 2023 జూలై 1 నాటికి ముగిసిందని గత పి ఆర్ సి బకాయిలు ఇప్పటివరకూ అందలేదని 11వ వేతన సవరణ గడువు ముగిసి మూడో సంవత్సరం నడుస్తున్నా ఇంతవరకూ 12వ వేతన సవరణ కమిటీ వేయలేదని, అలాగే ఐఆర్ ప్రకటన చేయలేదని పెండింగ్ బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకోలేదని ఉద్యోగులు పట్ల కూటమి ప్రభుత్వ వైఖరి సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. నేడు ఎస్టీయూ నాయకులు శ్రీకాకుళంలోని దాసరి క్రాంతి భవన్ నందు ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు అంతా 12వ వేతన సవరణ కమిటీ వేసి 30% ఐఆర్ ప్రకటించి మెరుగైన పిఆర్సీ అమలు చేయాలని ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాస్తూ పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులందరినీ ముఖ్యమంత్రి కి 12వ వేతన సవరణ అమలు చేయాలని లేఖలు రాయాలని పిలుపునిచ్చారు. అలాగే జిల్లా అధ్యక్షులు యస్వీ రమణ మూర్తి మాట్లాడుతూ జిల్లాలో 471 మంది ఎంటిఎస్ ఉపాధ్యాయులు దూర ప్రాంతాల్లో పనిచేస్తున్నారని కనీస ఇంటి అద్దె అలవెన్స్ ఉంటే కొంతమేర ప్రయోజనం ఉండేదని ఇంటి అద్దె అలవెన్స్ లేకుండా కౌన్సిలింగ్ పేరిట దూర ప్రాంతాల్లోని స్థానాలను కేటాయించారని వారికి 62 సంవత్సరాలు పదవీ విరమణ వయసు పెంపు అలాగే కనీస ఇంటి అద్దె అలవెన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, గురువు శ్రీనివాసరావు, డీవీఎన్ పట్నాయక్,యస్ రామచంద్ర రావు, జి. తిరుమల రావు,ఎం. మురళీధర్ బి.ఇందిర పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 225 కేసుల రాజీ




**పలాస, సెప్టెంబరు 13(వార్త):** పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 225 కేసులు రాజీ కాబడి పరిష్కారం అయ్యాయని కోర్టు వర్గాలు తెలిపారు. అందులో క్రిమినల్ జెరీమానా కేసులు 145 కాగా, సివిల్ దావాలు 6, క్రిమినల్ కేసులు 33, చెక్ బౌన్స్ కేసులు 7, మనోవర్తి కేసులు రెండు, గృహహింస కేసులు ఒకటి, ఎక్సైజ్ కేసులు 27, ప్రీ లిటిగేషన్ కేసులు నాలుగు కేసుల రాజీ కాబడి పరిష్కారం జరిగాయని, దీనికి సంభందించి రాజీ పడిన నగదు 15,22,968 రూపాయలు కాగా, అపరాధ రుసుము సుమారు 2,88,900 రూపాయలు, ఎక్సైజ్ కేసులలో రూ. 1,61,968 వసూలు కాబడ్డాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో లోక్ అదాలత్ మెంబర్లుగా న్యాయ వాదులు పి.రాజారత్నం నాయుడు, ఎన్.వి.రమణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్ (ఘని),ఉపాధ్యక్షులు బి.కామేశ్వం రావు పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు టి.మురళీ మోహన్, పి.లక్ష్మీనారాయణ, కె.మన్మధరావు, కె.దేవరాజు, వి.రవికుమార్, బి.కాళిదాన్, జిఎం.ఎస్. అనిల్ రాజు, అంది రామకృష్ణ, కె.లోకేశ్వరరావు, డి.ఉషారాణి, పి.చిట్టిబాబు, కాశీబుగ్గ డి.ఎస్ పి. వి.వెంకట అప్పారావు, కాశీబుగ్గ సిఐ. పి.సూర్యనారాయణ, రూరల్ సి.ఐ. తిరుపతిరావు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు ఎస్.ఐ.లు నరసింహమూర్తి, నిహార్, పలాస ఎక్సైజ్ సి.ఐ.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కొత్తపల్లి విద్యార్థులు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 13(వార్త):** ఈనెల 11, 12 తేదీల్లో వమరవల్లి డైట్ లో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీల్లో అత్యధిక విభాగాల్లో ప్రతిభ చూపి పలువురిని అబ్బురపరచి మూడు స్థానాల్లో అక్టోబర్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా పరిషత్ పాఠశాల కొత్తపల్లి విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరు దృశ్య కళ 3డి విభాగం లో "సేవ్ గర్ల్ చైల్డ్ " థీమ్ కి నవదీప్, సాంప్రదాయ కథ చెప్పే విభాగంలో "సిగ్గు ఒగ్గు - జబ్బు తగ్గు" అనే ఒగ్గు కథ కు జ్ఞానశ్రీ, ప్రియాంక లు, థియేటర్ విభాగం లో "బ్రహ్మ సమాజం" కు హేమని, సరిత, దివ్య,శ్రావణి లకు ప్రథమ స్థానం లో నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. గ్రూపు 3డి దృశ్య కళలు లో గిరి, మణికంఠ లు ద్వితీయ స్థానం లో నిలిచారు. వీరికి డైట్ ప్రిన్సిపాల్ గౌరీ శంకర్, శ్రీకాకుళం డిప్యూటీ డీఈవో విజయ కుమారి లు బహుమతులు అందజేశారు.మొత్తం 12 విభాగాల్లో జిల్లాలో అత్యధికంగా 3 స్థానాలు ఒకే పాఠశాల పొందడం పై పిల్లలను మరియు గైడ్ టీచర్ షణ్ముఖ రావు ను సహ ఉపాధ్యాయులు డి. మల్లేశ్వర రావు లను ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి మరియు గ్రామస్తులు ప్రశంసించారు. కోటబొమ్మాళి మండలానికి ప్రస్తుతానికి ఇదే రికార్డు కావడం గమనార్హం.

## పలాస సెంటర్ లైటింగ్‌లో రేగిన మంటలు

**పలాస, సెప్టెంబరు 13(వార్త):** పలాస సెంటర్ లైటింగ్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి . కేటీ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ కు ఎదురుగా ఉన్న సెంటర్ లైటింగ్ పోల్ పై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. పోల్ పై ఉన్న ఏపీ ఫైబర్ నెట్ వర్క్ కేబుల్ తో పాటు ఇతర నెట్ వర్క్ ల కేబుళ్ల కు మంటలు అంటు కోవడంతో కేబుల్ వైర్లు చాలా వరకు అగ్నికి ఆహుతయ్యాయి.పోల్ పై కాలిపోతున్న కేబుల్ వైర్ల ను చూసిన కొందరు భయంతో పరుగులు తీశారు. వైర్లు తెగి రోడ్డు పై పడితే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉండటంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. ఇంతలో ఆప్రాంతంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న కాశీబుగ్గ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. బకెట్లతో వాటర్ తెచ్చిన పోలీసులు ఎగిసి పడుతున్న అగ్ని కీలలపై నీళ్లు చల్లి మంటలను అదుపు లోకి తెచ్చారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## లోక్ అదాలత్‌లో 111 కేసుల పరిష్కారం

**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్లో భాగంగా 111 కేసులు పరిష్కరించామని సివిల్ జడ్జి ఎస్ వాణి తెలిపారు. శనివారం నరసన్నపేట స్థానిక మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. 123 కేసులకు గాను 111 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. కేసులలో రాజీతోనే రాజా మార్గమని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది

**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 13(వార్త):** ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను టీడీపీ కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారత పూర్తిగా కరువైందని, మహిళలపై దారుణాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. "టీడీపీ కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలో 'ఆడబిడ్డ నిధి' పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్న ఆ హామీ ఊసే లేదని ఈ కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేయడమే" పని అని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక ప్రభుత్వమని, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కరువైందని, శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారి పాలనలో మహిళల సంక్షేమం, సాధికారత కోసం ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని, వారి సాధికారతను పూర్తిగా విస్మరించి, చంద్రబాబు నాయుడు కేవలం తన రాజకీయ స్వలాభం కోసమే పాటుపడుతున్నారని అన్నారు. "జగనన్న మహిళలను ఇంటి యజమానురాలుగా మార్చేందుకు కృషి చేశారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా వారిని బలోపేతం చేశారు. అమ్మఒడి పథకంతో పేద తల్లుల ఆశీస్సులు అందుకున్నారని అదేవిధంగా, దిశ చట్టం తీసుకొచ్చి మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థలో మహిళా పోలీసులను నియమించి, గ్రామీణ స్థాయిలో వారికి రక్షణ కల్పించడం జరిగింది అన్నారు. "కానీ, చంద్రబాబు నాయుడు పాలనలో మహిళలకు రక్షణ




కరువైంది. వారు రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే మహిళలను ఉపయోగించుకుంటున్నారు తప్ప, వారి భద్రతకు, సాధికారతకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు.

# డాక్టర్ కణితి విశ్వనాథం విగ్రహానికి నివాళులు



**పలాస, సెప్టెంబరు 13(వార్త):** మాజీ ఎం.పి. డాక్టర్ కణితి విశ్వనాథం విగ్రహానికి గవర్నమెంట్ హైస్కూల్ పలాస వద్ద పూలమాలలు వేసి శనివారం కుమారుడు కణితి రాజేంద్ర కుమార్తె డాక్టర్ కణితి శారద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలాస స్కూల్ స్టాఫ్ పాలవలస వైకుంఠ రావు, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. స్కూల్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థుల కోసం10 లక్షలు రూపాయలు ఖర్చుతో రూఫ్ వేశారు. ఫ్యాన్స్, ఆడిటోరియం స్టేజ్ నిర్మించేందుకు ఒప్పుకోవటం జరిగింది. డాక్టర్ కణితి విశ్వనాథం ఎక్స్ ఎంపి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్లే గ్రౌండ్ కోసం 3 ఎకరాల 60 సెంటులు భూమి వితరణ ఇవ్వగా అదే స్థలంలో సుమారు 5 కోట్లు ఖర్చుతో అందులో స్టేడియం ఏర్పాటు చేసేందుకుస్థానిక ఎమ్మెల్యే ద్వారా గవర్నమెంట్ కు లెటర్ ఇవ్వడం జరిగింది. మరో నెలరోజులలో కట్టుటకు సిద్ధంగా ఉన్నామని, కాకుండా పేదప్రజలకు ఉచిత వైద్యం కోసం నేత్ర %ల% కాన్సర్ హాస్పిటల్ స్థలం కోసం ఎమ్మెల్యే గౌతు శిరీష ద్వారా గవర్నమెంట్ కు లెటర్ పెట్టడం జరిగిందని వెల్లడించారు. స్థలం సేకరణ జరిగిన తక్షణమే హాస్పిటల్ కట్టడానికి సిద్ధంగా వున్నామని ప్రజా సేవలో డాక్టర్ కణితి విశ్వనాథం కుటుంబ సభ్యులు ఉంటారని ఈ సందర్భంగా వారు చెప్పారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం విజయవంతం

**పలాస, సెప్టెంబరు 13(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరము రెడ్ క్రాస్, రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో శనివారం విజయవంతం అయింది. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాస ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆదేశానుసారం కళాశాలలో ఉన్న రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని రామకృష్ణాపురంలో ఉన్న పవర్ గ్రిడ్ ఇంజనీర్స్ రెడ్ క్రాస్ సిబ్బంది సహకారంతో సెప్టెంబర్ 15 ఇంజినీర్స్ డే నిర్వహణ కోసం సేవా దృక్పథంతో స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని, ఆరోగ్యకరమైన వారు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ ప్రిన్స్ పాల్ గణపతి రావు, రెడ్ రిబ్బన్స్




క్లబ్ క్లబ్ కన్వీనర్ బి నర్సింహులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# 5 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 13(వార్త):** ఇచ్ఛాపురం, రైల్వే స్టేషన్ వద్ద 5 కిలోల గంజాయితో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు కాశిబుగ్గ డిఎస్పి వివి అప్పారావు చెప్పారు. టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు వీరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. తమిళనాడు కొయింబత్తూరు తిరుప్పూరు జిల్లా లకి చెందిన ముత్తు కుమార్, ఉదయ్ కుమార్ మరియు ముత్తు రామలింగం లు గంజాయి కి అలవాటు పడి పాండ్య రాజు వద్ద గంజాయి కొని చెవించే వారని చెప్పారు.గంజాయి అమ్మే కుమార్ అత్తవారి ఉరు ఒడిశా మోహన గ్రామం నుండి తీసుకుని వెళ్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. సమావేశంలో సిఐ ఎంచిన్నంనాయుడు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ మురళీకృష్ణ కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ అందజేత

**మందస, సెప్టెంబరు 13(వార్త):** మందస పట్టణానికి చెందిన ఏ.ఆర్. కానిస్టేబుల్ మురళీకృష్ణ బెహరా ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖలోని ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు దళంలో విధులను నిర్వహిస్తున్న మురళీకృష్ణ బెహరా(నెం.779) మృతి చెందగా.. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో ట్రెజరర్ కె.భుజంగ రావు, కార్యవర్గ సభ్యుడు నరసింగరావులు మందస కిల్లమ్మవీధిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ మురళీకృష్ణ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన భార్య మమతారాణి బెహరాకు జిల్లా డెత్ రిలీఫ్ ఫండ్ మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్, పోలీసు అసోసియేషన్ జిల్లా కమిటి అధ్యక్షుడు రోణంకి కృష్ణం నాయుడు ఆధ్వర్యంలోరూ.లక్ష చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు.

## వృద్ధునికి చేతి కర్రను అందించిన మిశ్రో



**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 13(వార్త):** లక్ష్మీనర్సుపేటలోని 90ఏళ్ల వృద్ధుడు నడికుప్పల అప్పారావుకు లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్ డా.ఎం.కె.మిశ్రో చేతి కర్రను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డా.మిశ్రో మాట్లాడుతూ దివ్యాంగులను, వృద్ధులను ప్రభుత్వాలతో పాటు సామాజికవేత్తలు, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా వారికి సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బి.రమాదేవి మాట్లాడుతూ డా.మిశ్రో చేస్తున్న సామాజిక సేవలు ఎంతో మందికి ఆదర్శనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర పాల్గొన్నారు.

## సాఫీగా కొనసాగిన యూరియా పంపిణీ



**నరసన్నపేట, సెప్టెంబరు 13(వార్త):** నరసన్నపేటలో ఇటీవల కాలంలో యూరియా బస్తాల కోసం రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం నరసన్నపేట మన గ్రోమోర్ దుకాణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా బస్తాలను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారిని వై.సూర్య కుమారి మాట్లాడుతూ.. సుమారు 350 బస్తాలు యూరియా పంపిణీ చేశామన్నారు. ఇంకా 611 బస్తాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.

## సురేశ్ కుటుంబానికి అండగా నిలుస్తాం

**జలుమూరు, సెప్టెంబరు 13(వార్త):** పాగోడు గ్రామానికి చెందిన విద్యుత్ జూనియర్ లైన్‌మన్ మామిడి సురేశ్ శుక్రవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వైసీపీ నేత ధర్మాన కృష్ణచైతన్య మృతుడి గృహానికి శనివారం వెళ్లి ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. జగనన్న ప్రభుత్వంలో ఉద్యోగం పొందిన సురేశ్కు ఇలా మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబానికి అండగా ఉండేందుకు కృషి చేస్తామన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546